క్లుప్తంగా

వేడుకగా సీతారాముల కల్యాణం

పూసపాటిరేగ: మండల కేంద్రమైన పూసపాటిరేగ పద్మశాలివీధి రామాలయంలో సీతారాముల కల్యాణం మంగళవారం ఘనంగా జరిగింది. వేదపండితులు మంత్రోచ్ఛరణలతో లగ్న సమయమందు సీతమ్మతల్లి మంగళ సూత్రాలను భక్తులకు చూపిస్తూ మాంగల్యధారణ గావించారు. అనంతరం పద్మశాలి వీధి కమిటీ భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న టీమ్ లీడర్ జనార్దనరావు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ రోగులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ తుంపల్లి జనార్దనరావు అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ రోగులకు అందించే భోజనాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నం, సాంబారు, పప్పు, గుడ్డు రుచి చూశారు. రోగులకు సకాలంలో భోజనాన్ని అందించాలని తెలిపారు. తర్వాత ఆరోగ్యశ్రీ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను వైద్య సేవలు గురించి ఆరా తీశారు. సకాలంలో వైద్యులు చికిత్స అందిస్తున్నారా.. లేదా, సేవలు అందించడానికి ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా.. అని అడిగి తెలుసుకున్నారు.

పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలి

పూసపాటిరేగ: పెంచిన గ్యాస్ చార్జీలు తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక జాతీయ రహదారిపై పెరిగిన ధరలపై మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్‌పై 50 రుపాయిలు పెంచడం దారుణం అన్నారు. ప్రజలు కొనుగోలు శక్తి పడిపోతున్న తరుణంలో ప్రజలు వినియోగిస్తున్న నిత్యవసరమైన గ్యాస్ ధర పెంచడం ప్రజలు నెత్తిన భారం పడుతోంది అన్నారు. కార్యక్రమంలో వాళ్లె సూర్యనారాయణ, పి.మహేష్, డి.సంతోష్, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

హోమ్ కంపోస్ట్‌పై అవగాహన అవసరం

విజయనగరం: హోమ్ కంపోస్ట్ విధానం పట్ల ప్రజలు మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. కమిషనర్ ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది పలు ప్రాంతాలలో మంగళవారం హోమ్ కంపోస్ట్ విధానంపై అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ మొక్కలకు ఎరువుగా, నేల యొక్క భౌతిక రసాయన జీవ లక్షణాలను మెరుగుపరచడానికి ఉపయోగించే మిశ్రమాన్నే కంపోస్ట్‌గా పరిగణించబడుతుందని అన్నారు. ఈ కంపోస్ట్ విధానాన్ని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో సులభతరమైన పద్ధతుల్లో తయారు చేసుకోవచ్చన్నారు. దీనివల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు.

అలరించిన భక్తి సంగీతాలాపన



భక్తి సంగీతాలాపన చేస్తున్న గాయనీ, గాయకులు

విజయనగరం టౌన్: స్థానిక తోటపాలెం కోదండరామస్వామి దేవాలయం ఆవరణలో మంగళవారం రాత్రి నిర్వహించిన భక్తి సంగీతాలాపన ఆద్యంతం ఆకట్టుకుంది. విశాఖ నుంచి వచ్చిన శివ టీమ్ ఆధ్వర్యంలో గాయనీ, గాయకులు రాజీ పద్మ, జ్యోతి, చాముండేశ్వరి, వేణులు అన్నమాచార్య కీర్తనలు, పలు సినీ భక్తిగీతాలు ఆలపించి అలరించారు. తబలపై శివ, కీబోర్డుపై రామ్మోహన్, ప్యాడ్స్‌పై చిన్నిలు సహకరించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు కళాకారులను ఘనంగా సత్కరించారు.

పోయిన బ్యాగు అందజేత

రాజాం సిటీ: స్థానిక శాంతినగర్‌కు చెందిన రాయపురెడ్డి శ్వేత పోగొట్టుకున్న హ్యాండ్‌బ్యాగ్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆమెకు మంగళవారం అందజేశారు. వివరాలిలా ఉన్నాయి.. తన భర్తతో కలిసి గుయ్యానవలసలోని తమ బంధువుల ఇంటికి ఈ నెల 7వ తేదీన వెళ్లిన శ్వేత.. తన బ్యాగు ఎక్కడో రోడ్డుపై పడిపోయింది. కొంతదూరం వెళ్లిన తర్వాత ఈ విషయం గమనించి, వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. పోయిన బ్యాగులో తులం బంగారం చైను, పావుతులం చెవి దుద్దులు, రూ.5 వేలు నగదు ఉన్నాయి. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ కె.అశోక్ కుమార్ స్పందించి, సిబ్బందిని అప్రమత్తం చేశారు. రామానుజులపేట దారిలో ఓ ఇంటికి ఉన్న సీసీ కెమెరాను పరిశీలించగా, ఆ బ్యాగు హొంజరాంపేటకు చెందిన ఓ వ్యక్తికి దొరికినట్లు గుర్తించి, అతని నుంచి బ్యాగును రికవరీ చేసి, బాధిత మహిళకు అప్పగించారు.

జలం సంరక్షిస్తేనే.. జీవనం



- నగరంలో నానాటికి తగ్గిపోతున్న భూగర్భ జలాలు
- కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో 10 ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు
- భవన యజమానుల నుంచి వసూలు చేస్తున్న ఆదాయంపై నిర్లక్ష్యం

విజయనగరం: నీటి అవసరాలు పెరిగి, ఉపరితల జలాలు తగ్గిపోవడంతో భూగర్భ జలాలను విచక్షణ రహితంగా వినియోగిస్తున్నారు. దీంతో నీటి లభ్యత క్రమంగా తగ్గిపోతోంది. భూగర్భ జలాలను సంరక్షించడానికి అనేక కార్యక్రమాలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ అవన్నీ కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో వర్షపునీరు వృథా కాకుండా ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేసి భూగర్భంలోకి ఇంకేలా చూసుకునేందుకు అవసరమైన ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అలా జరగటం లేదు. భవిష్యత్తు మొత్తం నీటి లభ్యత, నీటి నాణ్యతపైనే ఆధారపడి ఉండటంతో అధికార యంత్రాంగంతో పాటు ప్రజలు ఇప్పటి నుంచి నీటి సంరక్షణ, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భంలోకి ఇంకించే ప్రయత్నాలు చిత్తశుద్ధితో చేయాల్సి ఉంది. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఉపగ్రహ సర్వేలో విజయనగరంలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నయంటూ నివేదిక వెల్లడవటం మరింత అప్రమత్తం కావాల్సి ఉంది.



ఇంకుడు గుంత

వందల అడుగులు తవ్వుతున్నా..

విజయనగరం కార్పొరేషన్ పరిధిలో భూగర్భ జలమట్టాలు రోజురోజుకు పడిపోతున్నాయి. సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులను అవలంబించడం ద్వారా నీటి పొదుపు పాటించి భూగర్భజలాలు సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ఒకే ప్రాంతంలో అధిక జనాభా కారణంగా పెరిగిన నీటి అవసరాలు, వాతావరణ మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు భూగర్భ జలంపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో బావులు, బోర్లలో భూగర్భజలాల లభ్యత తగ్గిపోతోంది. వందల అడుగుల నుంచి కొన్ని ప్రాంతాల్లో వెయ్యి అడుగులపైగా బోర్లు తవ్వాల్సిన దుస్థితి. వేసవిలో బహుళ అంతస్తుల భవనాలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో రోజురోజుకు భూగర్భజలాలు పడిపోతున్నాయి.

భూగర్భజలాల సంరక్షణకు చర్యలు

నగరంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో భూగర్భజలాల సంరక్షణకు చర్యలు చేపడుతున్నారు. కేంద్రం సహకారంతో నగరంలో వివిధ ప్రాంతాల్లో 10 ఇంకుడు గుంతలు నిర్మించేలా కార్యాచరణ రూపొందించాం. ఇందు కోసం రూ.49.72 లక్షలు మంజూరయ్యాయి.

– పి.నల్లనయ్య, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

డబ్బులుండీ ఎందుకీ నిర్లక్ష్యం

విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 200 చ.మీ స్థలంలో ఇంటిని నిర్మిస్తే ఇంకుడు గుంతకు రూ.1200 చొప్పున వసూలు చేస్తున్నారు. బహుళ అంతస్తుల భవనాలకు స్థల విస్తీర్ణం ఆధారంగా రూ.1200 నుంచి రూ.1500 వరకు ఆన్‌లైన్‌లో వసూలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఈ నిధులు వాటి కోసం ఖర్చు చేయడం లేదనే విమర్శలున్నాయి. గతంలో రూ.89 లక్షల వరకు నిధులు ఖర్చు చేయకుండా అధికారులు వదిలేసిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుత పాలకవర్గం హయాంలో 704 వరకు నిర్మించడానికి ప్రతిపాదన చేసి, ఒక్కో గుంతకు రూ.10 వేలు అవుతుందని అంచనా వేసి టెండర్లు పిలిచి 240 మాత్రమే నిర్మించారు. అనంతరం వాటి ప్రగతిపై పట్టించుకునే వారు లేకపోయారు. దీంతో నిధులుండీ నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

కేంద్రం సహకారంతో నగరంలో 10 చోట్ల నిర్మాణాలు

విజయనగరంలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నయంటూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సర్వేలో తేలటంతో నీటి స్థిరీకరించేందుకు అమృత్ 2.0లో భాగంగా పది ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వమే రూ.49.72 లక్షలు నిధులు మంజూరు చేసింది. వీటిని దాసన్నపేట ఎర్రచెరువు దక్షిణం వైపు, జమ్ములోని పైడిమాంబ గుడి ఎదురుగా, జొన్నగుడ్డి మున్సిపల్ పాఠశాల, తోటపాలెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, ధర్మపురి వసంత విహార్‌లో, కణపాక, గాజులరేగ, కెఎల్‌పురం, గోకపేటలోని అలకానంద పార్కు, అయ్యన్నపేటలోని కామాక్షినగర్ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు నిర్మించనున్నారు. ఒక్కో గుంత నిర్మాణానికి రూ.4.97 లక్షలు కేటాయించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పేదల విషయంలో రాజకీయాలు తగవు : సీపీఐ



తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నిరసన దీక్షలు

విజయనగరం గంటస్తంభం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఎలాంటి రాజకీయాలు చేయకుండా ప్రతి ఒక్కరికీ 2 సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని, రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయకపోతే సీపీఐ పేదల పక్షాన నిలబడి పోరాడుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ హెచ్చరించారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయిలు ప్రభుత్వ ఆర్థిక సాయం అందించాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారికి ఉన్న చోటే పట్టాలు మంజూరు చేయాలని, కరెంటు బిల్లులతో సంబంధం లేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ.. సీపీఐ విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునే కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందిస్తే ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. సర్వేల పేరుతో ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని విమర్శించారు. ఇళ్లు, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పూర్తిగా అప్పగించకుండా నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలు అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, మార్క్స్ నగర్ శాఖ కార్యదర్శి అప్పరుబోతు జగన్నాథం, సహాయ కార్యదర్శి బూర వాసు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

క్రెడాయ్ నూతన కార్యవర్గం ఎన్నిక



క్రెడాయ్ విజయనగరం చాప్టర్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

విజయనగరం: క్రెడాయ్ విజయనగరం చాప్టర్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. నగరంలోని ధర్మపురి వసంత విహార్‌లో గల కార్యాలయంలో 2025 – 27 సంవత్సరాలకు సంబంధించి నూతన ఛైర్మన్‌గా సిహెచ్.సూర్యనారాయణ రాజు, అధ్యక్షులుగా కె.రాజశేఖర్, కార్యదర్శిగా బి.సురేంద్ర, ఉపాధ్యక్షులుగా ఎం.వి.రమణ, బి.సత్యనారాయణ, ఎ.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా నారాయణం శేఖర్, కె.స్వామినాథ్, కోశాధికారిగా జి.నితిన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా అగస్త్య శ్రీనివాస్, ప్రదీప్‌కుమార్ రాజు, నయనేష్, శివ్వా నారాయణరావు, ఉల్లి కృష్ణమూర్తి నూతనంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సుభాష్‌చంద్రబోష్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నిర్మాణ రంగంలో నూతన విధానాలకు శ్రీకారం చుట్టాలన్నారు. వ్యవసాయ రంగం తరువాత అత్యంత ఉపాధి కల్పించే నిర్మాణంలో పని చేసే భవన నిర్మాణ కార్మికులకు అన్ని విధాలుగా మెరుగైన శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా చెరుకూరి శ్రీధర్ వ్యవహరించారు.

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు

విజయనగరం అర్బన్:

పట్టణంలోని సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో మంగళవారం హెటిరో ల్యాబ్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. సంస్థకు వివిధ కేడర్‌లో అర్హులైన 17 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. తొలిత ఎంఎస్‌సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ డిగ్రీ విద్యార్థులకు రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్ మరియు ఇంటర్వ్యూ నిర్వహించారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను కళాశాల అభినందించింది. ఎంపిక ప్రక్రియను హెటిరో ల్యాబ్ సంస్థ హెచ్ఆర్ అధికారులు మణికంఠ, దీక్షిత్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, సత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర ఎంవీ సాయిదేవమణి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేలు మాట్లాడాలి

విజయనగరం గంటస్తంభం: జిల్లాలోని కీలకమైన ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేలు జెడ్పీ సమావేశంలో మాట్లాడాలని పౌర వేదిక జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ప్రజాప్రతినిధులను కోరారు. మంగళవారం పౌరవేదిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగోసారి జెడ్పీ సమావేశం జరుగుతోందని, జిల్లాలో ప్రజలకు అత్యంత అవసరంగా జిల్లాకు క్యాన్సర్ ఆసుపత్రి అవసరమని, యువతకు ఉపాధి అవకాశాలు లేని పరిస్థితి నెలకొందన్నారు. విశాఖపట్నం వెళ్లే దారిలో జొన్నాడ వద్ద టోల్ గేట్ పెట్టి ప్రజలను దోచుకుంటున్నా ఎమ్మెల్యేలు, మంత్రి, ఇతర నాయకులు మౌనం వహించడం సరికాదన్నారు. మూతపడ్డ భీమసింగి సుగర్ ఫ్యాక్టరీపై కనీసం చర్చలేదని పేర్కొన్నారు. పౌర వేదిక నుంచి నివేదిక అందజేసినా ఎవ్వరూ కనీసం పట్టించుకోకుండా ఉన్నారన్నారు. సమావేశంలో పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు, కార్యదర్శి తుమ్మగంటి రాంమోహన్‌రావు, త్యాడ ప్రసాదరావు పట్నాయక్, భీంపల్లి భాస్కరుడు పాల్గొన్నారు.

సేవకు భక్తులు

డెంకాడ: మండలంలోని పినతాడివాడ గ్రామానికి చెందిన సత్యసాయి భక్తులు పుట్టపర్తి సత్యసాయి సన్నిధిలో సేవ చేసేందుకు మంగళవారం బయలుదేరి వెళ్లారు. 30 మంది భక్తులు స్వామి సన్నిధిలో సేవలు అందించనున్నారు. కార్యక్రమంలో సత్యసాయి భజనమండలి సభ్యులు కలిశెట్టి అప్పారావు, పప్పల బుచ్చయ్య, వాళ్లె సూర్యనారాయణ, కరుమజ్జి పైడినాయుడు, మీసాల పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల: కొండవెలగాడ, రామతీర్థం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విజయనగరం టౌన్ డీఈఈ పి.త్రినాధరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండవెలగాడ సబ్‌స్టేషన్ 33/11 కేవీ ఎస్ఎస్‌హెచ్ క్యూ ఫీడర్, పారసాం రూరల్ ఫీడర్ వ్యవసాయ కనెక్షన్ నిర్మాణం, సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కొండవెలగాడ, చంద్రంపేట, ఎల్ఎన్ పురం, తాళ్లపూడిపేట, టిక్కలి, తుమ్మలపేట, చినబూరాడపేట, పెద బూరాడపేట, పారసాం, గెద్దపేట, గుర్ల మండలం భూపాలపురం, ఆనందపురం గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు. రామతీర్థం 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో కూడా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నేడు మండల సమావేశం

భోగాపురం: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి అధ్యక్షతన ఈ నెల 10న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గాయత్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

బాధితుడికి బాసట

తంగుడుబిల్లి గ్రామస్తులు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం చేశారు. తంగుడుబిల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకొని ఇంటికి వచ్చిన ఏలూరు నారాయణస్వామికి గ్రామానికి చెందిన ఉద్యోగులు, పెద్దలు, యువకులు కలిసి తమ వంతు సాయంగా రూ.85వేలు మంగళవారం అందజేశారు. ఇటీవలె బాధితుడు నారాయణ స్వామి భార్య మృతి చెందింది. రజక వృత్తి చేసుకొని జీవిస్తున్న బాధితుడు సుగర్ వ్యాధి బారిన పడడంతో కాలు కూడా తొలగించారు. ఈ క్రమంలో నారాయణస్వామిని గ్రామస్తులంతా ఒక్కటై ఆదుకున్నారు.

– నెల్లిమర్ల



ధరల పెరుగుదలపై సీపీఎం నిరసన

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జొన్నగుడ్డు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శంకరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలపై బాదుడే..బాదుడు కార్యక్రమం ప్రారంభించిందన్నారు. గ్యాస్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్‌పై రూ.2 సుంకం పెంచి ప్రజలపై పెనుభారం వేసిందన్నారు. వెంటనే పెంచిన ధరలు తగ్గించాలన్నారు. రాబోయే కాలంలో మరిన్ని నిత్యావసర సరుకుల ధరలు బీజేపీ పాలనలో పెరగబొతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం గంటస్తంభం



ఉగ్రవాదులను నిలువరించేందుకే సాగర కవచం

సముద్ర మార్గంలో వచ్చే ఉగ్రవాదులను, చొరబాటుదార్లను నిలువరించేందుకు సాగర కవచం కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నుంచి గురువారం వరకు భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో నిర్వహించనున్న సాగర కవచం మాక్‌డ్రిల్‌పై మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ అవరణలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో 970 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉందన్నారు. చొరబాటుదారులను నిలువరించేందుకు ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు చెప్పారు. ఎస్పీ వకుల్ జిందల్ అదేశాల మేరకు రెండు మండలాల్లోని 16 మత్స్యకార గ్రామాల్లో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెరైన్ సీఐ బివిజి.రామరాజు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, 200 మంది సిబ్బంది పాల్గొన్నారు.

– భోగాపురం



సమష్టి కృషితో నగరానికి మంచి పేరు తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

విజయనగరం: ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాల అమలులో కార్యదర్శులు మరింత చురుకైన పాత్రను పోషించాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఎడ్యుకేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులు సమయపాలన పాటిస్తూ, రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, పారదర్శక విధానాన్ని అవలంభించాలని అన్నారు. అలాగే వసూలైన పన్నులను ఎప్పటికప్పుడు జమ చేయాలని చెప్పారు. ఈ విషయంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. అందరూ సమష్టి కృషితో విజయనగరం కార్పొరేషన్‌కు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు.

శతశాతం ఏబీసీ వ్యాక్సిన్ పూర్తి చేయాలి

నగరంలోని కుక్కలకు సంతాన నిరోధక ఆపరేషన్లతో పాటు యాంటీ రేబీస్ టీకాలు వేసే ప్రక్రియ శతశాతం పూర్తి చేయాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. కొత్తపేటలో గల డాగ్ స్టెరిలైజేషన్ సెంటర్‌ను ప్రజారోగ్యాధికారి డాక్టర్ కె.సాంబమూర్తితో కలిసి పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన కుక్కల సంతాన నిరోధక చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి



వినతిపత్రాన్ని అందుకుంటున్న డీఆర్ఓ శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్: గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న గ్రామ సభలపై అధికారులు చిత్తశుద్ధి వహించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఐక్య వేదిక ప్రతినిధులు మంగళవారం డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 1993లో అమలులోకి వచ్చిన 73వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంలో చేర్చబడిన 243వ అధికరణను అనుసరించి స్థానిక సంస్థల పాలనకు స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు. గ్రామ సభలపై ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం తన వంతు కృషి చేయకుండా కేవలం మొక్కుబడిగా ఒకే రోజు జరిపిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామ స్థాయిలో ఓటర్లు ప్రత్యక్షంగా పరిపాలనలో పాలుపంచుకోనే అవకాశాన్ని కల్పించాలని కోరారు. డీఆర్ఓను కలిసిన వారిలో ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గేదెల శ్రీరామమూర్తి, మహంతి అప్పలనాయుడు, పి.స్వాతి, ఎస్.శ్యామ్ తదితరులు ఉన్నారు.

'రౌండ్ టేబుల్ సమావేశం'



సమావేశంలో వివిధ సంఘాల నాయకులు

బొబ్బిలి: స్థానిక షాదీఖానాలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ బిల్లుపై రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం జరిగింది. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయగౌరి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.శంకరరావులు ఈ సమావేశానికి హాజరై, వక్ఫ్ బోర్డు చట్టం సవరణపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకించారు. ముస్లింల ఆస్తులకు పరిరక్షణ లేకుండా రాజ్యాంగానికి విరుద్ధంగా చట్టం సవరిస్తున్నారని విమర్శించారు. దేశంలోని 30 వక్ఫ్‌బోర్డులపై ఇతర సంస్థలు, అధికారులకు పెత్తనం ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. లక్షా 20 వేల కోట్ల ఆస్తులున్న వక్ఫ్ బోర్డులపై ఇతరుల అజమాయిషీ ఇవ్వడాన్ని మతపరమైన కుట్రగానే భావించాల్సి ఉంటుందన్నారు. తక్షణమే వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.